# 26- ఖుర్బానీ

**﴿لَنْ يَنَالَ اللهَّ لُحُومُهَا وَلاَ دِمَاؤُهَا وَلَكِنْ يَّنَالُهُ التَّقْوَى مِنْكُمْ﴾ الحج:٣٧**

**వాటి మాంసమూ లేదా వాటి రక్తమూ అల్లాహ్ కు చేరదు. కాని మీ భయభక్తులు ఆయనకు చేరుతాయి.** (22: హజ్: 37).

عن أنس ﵁ قال: **ضحّى رسول الله ﷺ بكبشين أملحين أقرنين ذبحهما بيده وسمى وكبّر ووضع رجله على صفاحهما.**

ప్రవక్త ﷺ కొమ్ములుగల, గోదుమ రంగుగల రెండు గొర్రెల ఖుర్బానీ ఇచ్చారు. వాటి మెడ క్రింద కాలు పెట్టి "బిస్మిల్లాహి అల్లాహు అక్బర్" అని

పలికి స్వయంగా తన చేతితో జిబహ్ చేశారు అని అనస్ రజియల్లాహు అన్హు ఉల్లేఖించారు. (ముస్లిం).

عن ابي بردة ﷺ أنه ضحّى قبل الصلاة فقال رسول الله ﷺ: **تلك شاة لحم**. فقال: يا رسول الله، إن عندي جذعة من المعز؟ فقال: **ضحِّ بها ولا تصلح لأحد غيرك**، ثم قال ﷺ: **من ضحّى قبل الصلاة فإنما ذبح لنفسه ومن ذبح بعد الصلاة فقد تمّ نسكه وأصاب سنة المسلمين**.

అబూ బుర్ద రజియల్లాహు అన్హు కథనం: తను (ఈదుల్ అజ్హా రోజు) నమాజుకు ముందే ఖుర్బానీ చేశారు. అప్పుడు ప్రవక్త ﷺ (కు ఈ విషయం తెలిసి) "**ఇది సాధరణ మేక మాంసం**". (అనగా నమాజుకు ముందు చేసినందున నీ ఖుర్బానీ కాలేదు). 'ప్రవక్తా! ﷺ నా వద్ద 'జజఅ' (ఆరు మాసములు నిండిన మేక పిల్ల) మాత్రమే ఉంది' అని అతనడిగాడు. దానికి ప్రవక్త ﷺ ఇలా చెప్పారుః "**దాని ఖుర్బానీ ఇవ్వు. కాని ఆ ఈడుగల మేక నీకు తప్ప మరెవ్వరికీ సమ్మతం కాదు**". ఇంకా ఇలా చెప్పారుః "**ఎవరయితే (ఈదుల్ అజ్హా) నమాజుకు ముందు ఖుర్బానీ చేస్తారో, అది తన కొరకు జిబహ్ చేసుకున్నట్లు. ఎవరయితే నమాజు తర్వాత చేస్తారో వారి ఖుర్బానీ పూర్తి అయినట్లు. వారు ముస్లింల సున్నతును పాటించినవారవుతారు**". (బుఖారి, ముస్లిం).

عن جابر ﷺ قال: قال رسول الله ﷺ: **لاتذبحوا إلاّ مسنّة إلاّ أن تعسُر عليكم فتذبحوا جذعة من الضّان**.

**"పళ్లు వచ్చి ఉన్న (ఒక సంవత్సరం ఈడుగల) జంతువునే జిబహ్ చేయండి. అది దొరుకుట అతికష్టమైనప్పుడే ఆరు మాసాలు నిండిన గొర్రె పిల్లను జిబహ్ చేయండి"**. (ముస్లిం).

## విశేషాలుః

1- ఖుర్బానీ చేయుట ధర్మం.

2– ఖుర్బానీ ఇచ్చే వ్యక్తి తాను స్వయంగా తన చేతితో జిబహ్ చేయుట అభిలషణీయం.

3– నమాజ్ తర్వాత ఖుర్బానీ జంతువును జిబహ్ చేయాలి. ముందు చేయరాదు.